పచ్చని పల్లెల్లో ఫార్మా చిచ్చు

- సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో 1983 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్
- బలవంతపు భూసేకరణపై తిరగబడుతున్న రైతులు
- రెవెన్యూ అధికారుల ఘెరావ్
- ఇప్పటికే నిమ్జ్ కోసం 9 వేల ఎకరాల సేకరణకు చర్యలు
- ఇప్పుడు ఫార్మాసిటీ పేరుతో మరో పిడుగు
- రోడ్డున పడనున్న వేల కుటుంబాలు

నాడు నిమ్జ్.. నేడు ఫార్మాసిటీ ముప్పు

సంగారెడ్డి సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): పచ్చిన పల్లెల్లో ఫార్మాసిటీ చిచ్చుపెడుతున్నది. సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై రైతులు, ప్రజలు భగ్గుమంటున్నారు. డప్పూరు, వడ్డీ, మాల్గి పరిధిలో 1,983 ఎకరాల్లో ఫార్మాసిటీ, లైఫ్‌సైన్సెస్ హబ్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఫార్మాసిటీ పేరుతో తమ భూములను బలవంతంగా లాక్కోవడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల ఫార్మా భూములను చూసేందుకు వచ్చిన అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీవో రాజు, ఇతర రెవెన్యూ అధికారులను అడ్డుకుని ఘెరావ్ చేశారు. భూసేకరణను నిలిపివేయాలంటూ మంగళవారం ధర్నాకు దిగారు. రైతుల ఆందోళనకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తున్నది.

జహీరాబాద్ నియోజకవర్గంలో మంజీరా నదికి సమీపంలో ఉన్న న్యాల్‌కల్ మండలం పచ్చని పంటలకు నెలవు. నల్లరేగడి భూముల్లో రెండు పంటలతో సంతోషంగా ఉన్న న్యాల్‌కల్ మండల రైతులపై మొదట నిమ్జ్ పిడుగుపడింది. నిమ్జ్ ఏర్పాటు కోసం రేజింతల్, న్యామతాబాద్, హద్నూర్, బసంత్‌పూర్, రుక్మాపూర్, ముంగి తదితర గ్రామాల్లో తొమ్మిది వేల ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వగా, ఇప్పటికే సుమారు రెండువేల ఎకరాల భూ సేకరణ పూర్తయ్యింది. భూసేకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. నిమ్జ్ భూసేకరణకు వ్యతిరేకంగా ఇప్పటికే రైతులు ఆందోళనచేయడంతోపాటు న్యాయస్థానాలను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి సర్కార్ న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఇప్పటికే నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన న్యాల్‌కల్ మండల రైతులు తాజాగా ఫార్మాసిటీ ఏర్పాటుతో సారవంతమైన భూములను కోల్పోనున్నారు. హైదరాబాద్ సమీపంలో తలపెట్టిన అతిపెద్ద ఫార్మాసిటీని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రద్దు చేసి, న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుపై స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. హైదరాబాద్ సమీపంలో జీరో డిశ్చార్జ్ కంపెనీల ఏర్పాటుకు ఫార్మా కంపెనీలు ముందుకొచ్చిన నేపథ్యంలో హైదరాబాద్, రంగారెడ్డి సమీపంలో కాకుండా న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం ఎవరి లాభం కోసం అనే చర్చ నడుస్తున్నది.

భూములు కోల్పోనున్న పేద, దళిత రైతులు

న్యాల్‌కల్ మండలంలో ఫార్మాసిటీ ఏర్పాటుకు 1,983 ఎకరాల భూ సేకరణ కోసం గత నెల 21, 23 తేదీల్లో ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో భాగంగా 1,070 ఎకరాల పట్టా భూమిని, 912 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించనున్నారు. డప్పూరు గ్రామంలో 930 ఎకరాల పట్టా, 516 ఎకరాల అసైన్డ్‌భూమి, వడ్డి గ్రామంలో 61.30 ఎకరాల పట్టా, 220.23 ఎకరాల అసైన్డ్‌భూమి, మాల్గి గ్రామంలో 79.33 ఎకరాల పట్టా, 176.8 ఎకరాల అసైన్డ్‌భూమిని సేకరించనున్నారు. ఫార్మాసిటీ ఏర్పాటుతో అసైన్డ్‌భూముల్లో పంటలు సాగు చేసుకుని జీవిస్తున్న 1,000కిపైగా పేద కుటుంబాలు భూసేకరణతో రోడ్డున పడనున్నాయి. ప్రస్తుతం ఫార్మాసిటీ కోసం సేకరిస్తున్న భూముల విలువ ఎకరాకు రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉంటుంది. రెండు పంటలు పండే ఇంత విలువైన భూముల్లో కాలుష్యకారకమైన ఫార్మా కంపెనీలకు ఇస్తే తమ బతుకులు ఏమి కావాలని రైతులు ఆందోళన చెందుతున్నారు.

> **భూములు ఇవ్వం**
>
> మాకు ఉన్నదే ఎకరం భూమి. దీనిని కూడా ఫార్మాసిటీకి లాక్కుంటే ఎలా బతకాలి? మా కుటుంబ జీవనం ఆస్తవ్యస్తమవుతుంది. అందుకే ప్రాణాలు పోయినా సరే భూములను ఇచ్చేది లేదు. ప్రభుత్వం ఫార్మాసిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.
>
> – బేగరి విఠల్, రైతు, డప్పూర్, న్యాల్‌కల్ మండలం

అర్చకుల వేతనాలకు బ్రేక్

- ధూప దీప నైవేద్యాలకు అంతరాయం
- అవుట్ సోర్సింగ్ ఉద్యోగులదీ అదే పరిస్థితి

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): అర్చకులకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించే ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం అందజేసిన వేతనాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నది. రాష్ట్రంలోని దాదాపు 13వేల పైచిలుకు ఆలయాల్లో అర్చకులు, అర్చక ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా 3,500, ధూప దీప నైవేద్య(డీడీఎన్) పథకం ద్వారా 9,771 ఆలయాల్లో వేతనాలు ఇవ్వాల్సి ఉన్నది. కేసీఆర్ హయాంలో క్రమం తప్పకుండా వేతనాలు అందుకున్న అర్చకులకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. దేవాదాయ శాఖ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో పనిచేస్తున్న సుమారు 100మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సైతం రెండు నెలలుగా వేతనాలు అందలేదు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే ఇస్తామని చెబుతున్నారు. రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని, ఆలయాల్లో ధూప దీప నైవేద్య కార్యక్రమాలు నిలిపివేయాల్సిన పరిస్థితి వస్తున్నదని అర్చకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రుణమాఫీ కోసం రైతుల ఆందోళన

రుణమాఫీ అందడం లేదంటూ బుధవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్ సహకార సంఘం కార్యాలయం ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. మండలంలోని అన్ని బ్యాంకులకు రుణమాఫీ వస్తే, తమకెందుకు రావడం లేదని సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. సుమారు గంటపాటు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. – రామాయంపేట

తాగునీటి కోసం మూడు జిల్లాల్లో నిరసనలు

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంటలో కురుస్తున్న వర్షాలతో బోరుబావులు పూడుకుపోయి.. మోటర్లు కొట్టుకుపోయాయి. పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ట్యాంకర్లు వచ్చినప్పుడు మహిళలు బిందెలతో యుద్ధం చేయాల్సి వస్తున్నది. జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దతండావాసులు కూడా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించారు. పది రోజులుగా బుడగజంగం కాల నీకి నీళ్లు రావడంలేదని వాపోయారు. – దేవరకద్ర(రూరల్)(చిన్నచింతకుంట)/మల్దకల్/పెద్దకొడప్‌గల్

ప్రాణాలు పోయినా భూములిచ్చేది లేదు!

- ఫార్మాసిటీ నిర్వాసిత రైతుల కన్నెర్ర
- పంచాయతీ కార్యదర్శి, ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్బంధం



జేపీ కార్యాలయానికి తాళం వేసి ఆందోళన చేపడుతున్న నాయకులు, భూబాధితులు

న్యాల్‌కల్, సెప్టెంబర్ 4: తమకు తెలియకుండానే ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేపడుతున్నారని, ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేస్తూ సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్‌లో భూ బాధితులు, ప్రజలు అధికారులను నిర్బంధించారు. న్యాల్‌కల్ మండలంలోని వడ్డి, డప్పూర్, మల్గి గ్రామ శివారులో ఏర్పాటయ్యే ఫార్మాసిటీ భూ బాధితులు, ప్రజలు బుధవారం డప్పూర్ పంచాయతీ కార్యదర్శి జైసింగ్‌ను పంచాయతీ కార్యాలయంలో గంటన్నరకు పైగా నిర్బంధించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఫార్మాసిటీకి సంబంధించి తనకు సంబంధం లేదని పంచాయతీ కార్యదర్శి చెప్పడంతో ఆగ్రహించిన బాధితులు కలిసి ఆయనను నిర్బంధించారు. ఉన్నతాధికారులు వచ్చేదాకా విడిచేది లేదని భీష్మించుకొని కూర్చున్నారు. మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సురేశ్ చేరుకొని వారితో మాట్లాడారు. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు వచ్చేదాకా ఇద్దరూ కదిలేది లేదని తెగేసిచెప్పారు. తమ జీవనాధారమైన భూములను ఫార్మాసిటీకి తీసుకొని తీరని అన్యాయం చేస్తున్న విషయం ముందే తెలిసినా తమకేందుకు చెప్పడం లేదని నిలదీశారు. వెంటనే ఎంపీడీవో సురేశ్ హద్నూర్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చేరుకుని నిర్బంధంలో ఉన్న ఎంపీడీవో, కార్యదర్శిని బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నించగా బాధితులు, ప్రజలు అడ్డుకున్నారు. జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు చేరుకుని నాయకులతో మాట్లాడారు. కలెక్టర్‌తో మాట్లాడేందుకు నిర్వాసితులు ఎప్పుడు వస్తారో చెప్పాలని, అప్పటిదాకా అధికారులు ఎవరూ ఇక్కడికి రారని చెప్పి ఎంపీడీవో, కార్యదర్శిని పోలీసులు విడిపించి తీసుకెళ్లారు. సమాచారం లేకుండా అధికారులు గ్రామాలకు రావద్దని నిర్వాసితులు ఎంపీడీవో, పోలీసులకు వినతిపత్రాన్ని అందజేశారు.

దళితులపై చిన్నచూపు!

- ఆకలినైనా సహిస్తా.. అవమానాన్ని భరించను
- ప్రొటోకాల్ వివాదంపై నకిరేకల్ ఎమ్మెల్యే వీరేశం
- పోలీసు అధికారులపై స్పీకర్‌కు ప్రివిలేజ్ మోషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో దళిత ఎమ్మెల్యేలకు అవమానాలు జరగకుండా చూడాలని, తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను ఖూనీ చేయొద్దని కాంగ్రెస్ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. ఎమ్మెల్యేగా తన హక్కులను కాలరాసి, విధులకు ఆటంకపరిచిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం స్పీకర్‌ను కలిసిన ఆయన ప్రొటోకాల్ పాటించని పోలీసు అధికారులపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆకలినైనా సహిస్తా కానీ అవమానాన్ని భరించబోనని చెప్పారు. ఆగస్టు 30న భువనగిరిలో ఇరిగేషన్ శాఖ సమీక్షకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌ను కలిసేందుకు పోలీసులు తనను అనుమతించలేదని తెలిపారు. ఆ పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరినట్టు తెలిపారు. వారిని పిలిచి విచారిస్తామని స్పీకర్ హామీ ఇచ్చినట్టు చెప్పారు. ఈ విషయంలో ఉన్నతాధికారులను వదిలేసి కానిస్టేబుళ్లకే నోటీసులు ఇస్తున్నారని, దీనిని ఖండిస్తున్నట్టు ఎమ్మెల్యే వీరేశం తెలిపారు.

కరీంనగర్ సీపీ వ్యవహారాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సంచలన వ్యాఖ్యలు

కరీంనగర్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి): భువనగిరిలో దళిత ఎమ్మెల్యే వేముల వీరేశం(నకిరేకల్)కు పోలీసుల వల్ల జరిగిన ఘోర అవమానంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. దురహంకార పోకడలు ఉన్న పోలీసు అధికారులు అక్కడక్కడా ఉన్నారని, కరీంనగర్ సీపీ కూడా ఇదే తరహా పోకడలను అనుసరిస్తున్నారని ఆరోపించారు. మానకొండూర్ సీఐ పోస్టు ఖాళీగా ఉండడంతో సీఎం సహకారంతో నియమిస్తే దాన్ని కరీంనగర్ సీపీ రద్దు చేశారని వాపోయారు. అయినా పోస్టింగ్ తెచ్చుకున్న సీఐని, తాను కాదన్నా ఎలా పోస్టింగ్ తెచ్చుకున్నావంటూ సీపీ బెదిరిస్తున్నారని ఆరోపించారు. దళిత ఎమ్మెల్యే ఇంకో దళిత అధికారికి సీఐ పోస్టింగ్ వేయిస్తారా..? అనే చిన్నచూపు, దురహంకారమే సీపీ అభ్యంతరానికి కారణమని వాపోయారు. ఈ వ్యవహారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు.

ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో ధర్నా చేస్తున్న జేపీఎస్ నేతలు

'విద్యుత్తు' పదోన్నతులపై న్యాయవిచారణ చేపట్టాలి

విద్యుత్తు సౌధ మహాధర్నాలో జేపీఎస్ నేతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల్లో పదోన్నతులపై న్యాయవిచారణ చేపట్టాలని బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఖైరతాబాద్‌లోని విద్యుత్తు సౌధలో భారీ ధర్నా నిర్వహించారు. విద్యుత్తు సంస్థల్లో సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను అమలుచేయకుండా కొన్ని ఏండ్లుగా కండీషన్ల పేరుతో పదోన్నతులు కల్పిస్తున్నారని, ఇది సరికాదని జేపీసీ చైర్మన్ కోడెపాక కుమారస్వామి ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల యాజమాన్యాలు 3,830 మందికి పదోన్నతులు కల్పించాయని, ఇది పూర్తిగా అన్యాయమని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్‌రోస్ చొరవ తీసుకొని తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ ధర్నాకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మద్దతు ప్రకటించారు. అనంతరం నేతలంతా జేఎండీ శ్రీనివాస్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో కో చైర్మన్ ఆర్ సుధాకర్‌రెడ్డి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో కన్వీనర్ సీ భానుప్రకాశ్, రాజేందర్, సోమయాజులు, విజయ్‌కుమార్, యాదగిరి, మారం శ్రీనివాస్, బ్రహ్మేందర్‌రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల నిరసన

రెగ్యులర్ వీసీని నియమించాలని నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీలో బుధవారం విద్యార్థులు నిరసన చేపట్టారు. తమ 17 డిమాండ్లను నెరవేర్చాలంటూ క్యాంపస్‌లో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ భవనం ఎదుట ఆందోళన చేశారు. డిమాండ్లు నెరవేర్చేంత వరకు రోజూ ర్యాలీ నిర్వహించి నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. – బాసర

వివక్షకు పాల్పడితే దేశద్రోహులే: కేఎన్‌వీ

హైదరాబాద్, సెప్టెంబర్4 (నమస్తే తెలంగాణ): కుల వివక్షకు పాల్పడే వారిని దేశద్రోహులుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు నాగరాజు బుధవారం ఎస్సీ, ఎస్టీ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. రియల్‌ఎస్టేట్ పేరుతో ఎస్సీ, ఎస్టీల భూముల ఆక్రమణ, కుల బహిష్కరణ, లైంగికదాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్షకు పాల్పడిన వారిని దేశద్రోహులుగా ప్రకటించేలా పార్లమెంట్‌లో చట్టం చేసేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు.

APK PM KISAN NEW REJSTION KYC FOR.
5.8 MB • APK

పీఎం కిసాన్ లింక్‌తో ఫోన్ హ్యాక్

ములుగు రూరల్, సెప్టెంబర్ 4: 'పీఎం కిసాన్ న్యూ రిజిస్ట్రేషన్ కేవైసీ' పేరుతో వాట్సప్‌లో వస్తున్న లింక్‌తో మొబైల్స్ హ్యాక్ అవుతున్నాయి. వారం రోజులుగా వాట్సప్‌లోని గ్రూప్‌ల ద్వారా ఈ యాప్ వివరాలు వస్తున్నాయి. కొందరు పీఎం కిసాన్ కేవైసీ అనుకొని వివరాలు నమోదు చేసే క్రమంలో మొబైల్‌లోని ఇతర వాట్సప్ గ్రూపుల్లోకి యాప్ లింక్ ఫార్వర్డ్ అవుతున్నది. మొబైల్‌లోని వ్యక్తిగత డాటాతోపాటు బ్యాంకు అకౌంట్లు, పిన్ నంబర్లు, ఫోన్‌పే, గూగూల్‌పే వంటి యాప్‌ల పాస్‌వర్డ్‌లు దొంగిలించేందుకు కారణంగా నిలుస్తున్నది.

రోడ్డెక్కిన కాంగ్రెస్ కార్యకర్తలు

ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను చేర్చుకోవద్దని డిమాండ్ చేస్తూ అధిష్ఠానానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యకర్తలు రోడ్డెక్కారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని సోమగూడెంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిష్ఠానానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, నిరసన వ్యక్తం చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా, గుట్టుచప్పుడు కాకుండా పార్టీలో చేర్చుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ హైదరాబాద్‌లో చేరికల కార్యక్రమాన్ని రద్దు చేసుకోవడంతో ఆందోళన విరమించారు. – కాసిపేట

వానల్లో మండుతున్న ఇసుక!

- ధరలకు మళ్లీ రెక్కలు
- 2200కు చేరిన టన్ను ధర
- వర్షాలతో నిలిచిన సరఫరా

హైదరాబాద్, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో ఇసుక ధరలకు రెక్కలొచ్చాయి. టన్ను ఇసుక ధర మళ్లీ రూ.2,200 నుంచి రూ.2,500 వరకు ఎగబాకింది. గత ఆగస్టులో వర్షాల సందర్భంగా రూ.2,500కు చేరుకున్నప్పటికీ, వర్షాలు తగ్గాక ధరలు రూ.1,500కు దిగివచ్చాయి. ఇప్పుడు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మళ్లీ రూ.2,200కు చేరింది. కొన్నిచోట్ల రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ఇసుక రీచ్‌ల నుంచి ప్రతి నెలా 10 నుంచి 15 లక్షల టన్నుల ఇసుకను తవ్వి తీస్తారు. వర్షాకాలంలో కొంత తక్కువగా, వేసవిలో కొంత ఎక్కువగా ఇసుకను తీయడం పరిపాటి. ఆగస్టు చివరి వారం నుంచి ఇప్పటివరకు వర్షాల వల్ల రీచ్‌ల వద్ద ఇసుక తీయడం సాధ్యం కాలేదు. దాదాపు వారం రోజులుగా ఇసుక తీయడం నిలిచిపోవడంతో స్టాక్‌యార్డ్‌ల వద్ద కూడా నిల్వలు అడుగంటిపోయాయి. వర్షాల వల్ల కొద్దిరోజులుగా 19 రీచ్‌లు మాత్రమే అందుబాటులో ఉండగా, ఇటీవలి వర్షాలు, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదల కారణంగా అక్కడ కూడా ఇసుక తోడటం నిలిపివేశారు. టెండర్లు ఖరారై ఇసుక తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న మేడిగడ్డ ప్రాంతంలో నీటి ప్రవాహం నిలిచిపోయేవరకు ఇసుక తీయడం సాధ్యంకాదని ఇదివరకే అధికారులు తేల్చారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతించడం వల్ల మరో 25 రీచ్‌ల్లో ఇసుక తీసుకునే వీలున్నప్పటికీ నీటి ప్రవాహం వల్ల అక్కడ కూడా ప్రస్తుతం సాధ్యం కావడం లేదని అధికారులు తెలిపారు.

నీట మునిగిన ఇసుక రీచ్‌లతో ఇబ్బందులు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, మంచిర్యాల, ములుగు, పెద్దపల్లి తదితర ప్రాంతాల నుంచి అధికంగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇసుక సరఫరా అవుతున్నది. ఈ ప్రాంతాలన్నీ ప్రస్తుత వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాలుగా మారిపోయాయి. ఎగువ ప్రాంతాల్లో కూడా కురుస్తున్న అధిక వర్షాల వల్ల నదులకు వరద పోటెత్తడంతో ఇసుక తీసుకునే పరిస్థితి లేకుండా పోయింది.

ఈ ఏడాది 350 కోట్ల ఆదాయం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 85.62 లక్షల టన్నుల ఇసుక విక్రయాలు జరుగగా, వాటిపై టీజీఎండీసీకి రూ.350.57 కోట్ల ఆదాయం సమకూరింది. గత ఏడాది ఇదే కాలంలో 69.03 లక్షల టన్నుల విక్రయం ద్వారా రూ.280.70 కోట్ల ఆదాయం రావడం విశేషం. గత ఏడాదితో పోల్చుకుంటే సుమారు రూ.70 కోట్ల ఆదాయం అధికంగా వచ్చినట్టయ్యింది.

ఐదు నెలల్లో ఇసుక విక్రయాలు

నెల	ఇసుక (లక్షల టన్నులు)	ఆదాయం (రూ.కోట్లలో)
ఏప్రిల్	19.60	80.40
మే	19.13	78.35
జూన్	23.75	97.20
జూలై	13.04	53.47
ఆగస్టు	10.10	41.15
మొత్తం	85.62	350.57

కేన్స్‌తరలిపోవడం వాస్తవం: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): కేన్స్ టెక్నాలజీ సంస్థకు చెందిన అధునాతనమైన (ఓఎస్ఏటీ) యూనిట్ తెలంగాణ నుంచి గుజరాత్‌కు తరలిపోతుండటం నిజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అంశానికి సంబంధించి తాను ట్వీట్ చేసిన తర్వాత సంబంధిత మంత్రి ప్రజలను తప్పుదోవ పట్టించేలా కేన్స్ సంస్థ తెలంగాణలోనే ఉంటుందన్నట్టుగా ప్రకటన చేశారని మండిపడ్డారు. గుజరాత్‌కు తరలిపోతున్న ఓఎస్ఏటీ యూనిట్‌ను కొంగర్‌కలాన్‌లోనే ఏర్పాటు చేసి ఉంటే సెమీ కండక్టర్ల రంగానికి హైదరాబాద్‌లో మంచి భవిష్యత్ ఉండేదని అభిప్రాయపడ్డారు. కీలకమైన ఓఎస్ఏటీ, పీసీబీ యూనిట్లు తరలిపోతున్నప్పటికీ ఏమీ జరగలేదన్నట్టుగా మంత్రి మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని, అసమర్థ, గందరగోళ నిర్ణయాల కారణంగా రెండు పెద్ద ప్రాజెక్ట్‌లను కోల్పోతున్నామని విమర్శించారు. కేన్స్ సంస్థ పెట్టుబడుల విషయంలో ప్రజల ముందు నిజాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

సివిల్ సప్లయిస్‌లో భారీ అవినీతి

హైకోర్టులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పిల్

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పౌరసరఫరాల కార్పొరేషన్ (టీజీసీఎస్సీఎల్)లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఖజానాకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లే అవకాశం ఉన్నదని పేర్కొంటూ ఆ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ప్రభుత్వం వద్ద ఉన్న వడ్లను తక్కువ ధరతో మిల్లర్లకు విక్రయించడం, వారి నుంచి అత్యధిక ధరకు బియ్యాన్ని కొనుగోలు చేయడం వల్ల ప్రతి మెట్రిక్ టన్నుకు రూ.32,799 మేర ప్రభుత్వానికి నష్టం వస్తున్నదని పేర్కొన్నారు. పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి, పౌరసరఫరాల కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ, కమిషనర్ తదితరులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ జరుపనున్నది.

ఐఐసీటీ ఆధ్వర్యంలో ఎకో పాలిథిన్ ఆవిష్కరణ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 4(నమస్తే తెలంగాణ) : ఫుడ్, ఫ్రూట్ ప్యాకింగ్‌కు అనువైన, పర్యావరణహితమైన పాలిథిన్(పాలిప్రొప్లీన్ కార్బొనేట్)ను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన పరిశోధకులు ఆవిష్కరించారు. సంస్థకు చెందిన పరిశోధకుడు జయరాముడు బృందం పర్యావరణహితమైన, మన్నికైన ప్యాకింగ్ ఉపకరణాలపై పరిశోధనలు చేస్తున్నారు. పాలిథిన్ కవర్లతో కలిగే దుష్పరిణామాల నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్యాకింగ్ అప్లికేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. సాధారణ పాలిథిన్ కవర్లతో పోల్చితే ఇందులో తేమ నిర్వహణ, యాంటీ రైపింగ్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు తక్కువగా ఉన్నట్టు గుర్తించారు. పీపీసీ ద్వారా భవిష్యత్తులో పండ్లు, ఆహార పదార్థాల నిల్వ కోసం వినియోగించే ప్యాకింగ్ ఉత్పత్తులు మారిపోనున్నాయని, దీంతో వాటి మన్నిక కాలం పెరుగుతుందని భావిస్తున్నట్టు చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో 'డైనమైట్స్'పై నోటీసులు

కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఉన్న కొండరాళ్ల తొలగింపునకు రేయింబవళ్లు పేలుడు పదార్థాలను వినియోగించడంపై దాఖలైన పిల్ పై హైకోర్టు స్పందించింది. రాత్రింబవళ్లు పేలుడు పదార్థాలను వినియోగిస్తుండటంపై పత్రికల్లో వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించిం ది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలో క్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం దీనిపై బుధవారం విచారణ చేపట్టింది. ప్రతివాదులకు న